క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



విశపు బాలసుబ్రహ్మణ్యంతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పర్వతరెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరు రామ్‌జీనగర్‌లో మాజీ ఎమ్మెల్సీ విశపు బాలసుబ్రహ్మణ్యాన్ని ఆయన నివాసంలో వైఎస్సార్‌సీపీ నెల్లూరు నగర ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు విషయాలపై చర్చించారు.

రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ రాక నేడు

నెల్లూరురూరల్: రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్ ఈనెల 7, 8వ తేదీల్లో జిల్లాలో పర్యటించనున్నారు. 7వ తేదీ రాత్రి 8 గంటలకు నెల్లూరుకు చేరుకుని రాత్రి బస చేస్తారు. 8వ తేదీ ఉదయం బుజబుజనెల్లూరుకు చెందిన ఎస్సీ నాయకుడు జె.రామయ్యను కలుస్తారు. అనంతరం ఉదయం 10.15 గంటలకు బయలుదేరి కడపకు వెళ్తారు.

కలెక్టర్‌ను కలిసిన కావలి ఎమ్మెల్యే

నెల్లూరురూరల్: జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాను కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి సోమవారం కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. కావలి నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించారు.

విశ్వనాథునికి రుద్రాభిషేకం



మనుబోలు: మండలంలోని మనుబోలు చెర్లోపల్లి రైల్వేగేటు సమీపంలో ఉన్న విశ్వనాథస్వామి ఆలయంలో సోమవారం రాత్రి రుద్రాభిషేకం నిర్వహించారు. అర్చకుడు శ్రీనివాసులు స్వామికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

మనుబోలు: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడిన ఘటన మండల పరిధిలోని జాతీయ రహదారిపై కాగితాలపూరు క్రాస్ వద్ద సోమవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. గూడూరు నుంచి వస్తున్న ఆయిల్ ట్యాంకర్ కాగితాలపూరు క్రాస్ వద్ద రోడ్డు దాటుతుండగా అదే సమయంలో నెల్లూరు నుంచి చెన్నై వెళ్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికి గాయాలయ్యాయి. ప్రమాదం కారణంగా హైవేపై కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ఎస్సై శివరాకేష్ ఆదేశాలతో హైవే మొబైల్ టీం ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

సహకార సంఘాలతో మెరుగైన సేవలు

ఇందుకూరుపేట: అగ్రికల్చరల్ కోఆపరేటివ్ సొసైటీ ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందుతాయని జోనల్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ గోగుల శ్రీనివాసులు అన్నారు. అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా మండలంలోని ఇందుకూరుపేట ఎంకేఆర్ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో సహకార సంఘాల ద్వారా ప్రజలకు కలిగే ప్రయోజనాల గురించి శిక్షణా తరగతులు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అవసరమైన విత్తనాలు, మందులు, ఎరువులు తక్కువ ధరలకు సహకార సంఘాల ద్వారా అందుబాటులో ఉంటాయని వివరించారు. అనంతరం వికసిత్ భారత్‌లో భాగంగా సహకార సంఘాల పాత్రపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తీసే దమ్ముందా?

- బరితెగిస్తున్న తమ్ముళ్లు
- రోడ్డును ఆక్రమించి కంటైనర్ షాపు ఏర్పాటు



మినీబైపాస్ రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసిన కంటైనర్ షాపు

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ పరిధిలో తెలుగు తమ్ముళ్ల ఆగడాలకు అడ్డూ అదుపులేకుండా పోయింది. మనల్ని ఎవడ్రా ఆపేది అన్నట్లు ఇష్టారాజ్యంగా రోడ్డును ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. తాజాగా మినీబైపాస్‌రోడ్డులోని వనంతోపు సెంటర్ సమీపంలో ఆదివారం రాత్రి రోడ్డును ఆక్రమించి కంటైనర్‌ను దింపారు. సోమవారం ఉదయానికి ఫాస్ట్‌ఫుడ్‌ను ఏర్పాటు చేసే ప్రక్రియ చకచకా సాగిపోయింది. సాధారణంగా ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య ఉంది. ఈ క్రమంలో కంటైనర్ షాపు ఏర్పాటుతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటి వరకు మినీబైపాస్‌రోడ్డులో తోపుడు బండ్లు, ఆటోలను నిలిపి పండ్లు, ఇతర ఫుడ్ ఐటమ్స్ విక్రయించుకుంటూ వ్యాపారాలు చేసుకునేవారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తినప్పుడు వాహనాలను అక్కడి నుంచి పోలీసులు తరలించేవారు. అయితే టీడీపీ నేతలు మరింత బరితెగించి ఏకంగా కంటైనర్ షాపును ఏర్పాటు చేయడంపై స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మార్జిన్ దాటిన దుకాణాలను తొలగిస్తాం



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ నందన్

నెల్లూరు(బారకాసు): నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో రోడ్లను ఆక్రమిస్తూ నిర్మాణాలు చేపట్టవద్దని, నగరాభివృద్ధిలో భాగంగా మార్జిన్ దాటిన నిర్మాణాలను తప్పనిసరిగా తొలగించి వేస్తామని కమిషనర్ వైఓ నందన్ హెచ్చరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఎన్‌ఎంసీ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో సోమవారం నిర్వహించారు. కమిషనర్ పాల్గొని ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం నగరవ్యాప్తంగా అన్ని డివిజన్లలో రోడ్డు ఆక్రమణలను తొలగిస్తున్నామని తెలియజేశారు. ప్రభుత్వ, కార్పొరేషన్ స్థలాలు, ఫుట్‌పాత్‌లు ఆక్రమించి ఎలాంటి నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నెల్లూరు సిటీ, రూరల్ నియోజకవర్గాల ప్రజాప్రతినిధుల సూచనల మేరకు నిర్దేశించిన జోన్లలో మాత్రమే వ్యాపారాలు నిర్వహించుకునేలా రోడ్డు మార్జిన్ వ్యాపారులకు మార్గదర్శకాలను రూపొందిస్తున్నామని తెలిపారు. కాగా ప్రజా సమస్యల పరిష్కార వేదికలో విభాగాల వారీగా అకౌంట్ సెక్షన్–3, ఆప్కాస్–7, అడ్మినిస్ట్రేషన్–2, ఇంజినీరింగ్–6, హౌసింగ్ సెక్షన్–18, పబ్లిక్ హెల్త్–4, రెవెన్యూ–5, టౌన్ ప్లానింగ్–8 ఇలా మొత్తం 53 వినతులను స్వీకరించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఇంజినీరింగ్ విభాగం ఎస్‌ఈ రామ్మోహన్‌రావు, సిటీ ప్లానర్ హిమబిందు, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కనకాద్రి, మేనేజర్ రాజేశ్వరితో పాటు అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు



నెల్లూరు(బృందావనం): సింహపురి గ్రామదేవత మూలాపేటలోని ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో హుండీ కానుకల లెక్కింపు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్య నిర్వహణాధికారి గిరికృష్ణ మాట్లాడుతూ ఈ ఏడాది ఆగస్టు 29 నుంచి అక్టోబరు 6వ తేదీ వరకు భక్తులు కానుకల రూపంలో రూ.3,57,773 సమర్పించారన్నారు. పర్యవేక్షణాధికారిగా జిల్లా దేవదాయ, ధర్మదాయశాఖ నెల్లూరు ఇన్‌స్పెక్టర్ డి.శ్రీనివాస్ వ్యవహరించారు. దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ ఒట్టూరు సురేంద్ర, అర్చకులు పి.చంద్రశేఖర్ స్వామి, పి.దైవజ్ఞ ఆచార్యులు, ధర్మకర్తల మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం



నెల్లూరు(బృందావనం): మూలాపేట శంకరమఠంలో ఆశ్వయుజ పౌర్ణమిని పురస్కరించుకుని కామాక్షి సమేత చంద్రమౌళీశ్వరస్వామి సన్నిధిలో సోమవారం చండీహోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కంచికామకోటి పీఠానికి చెందిన సోమేశ్వరశర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన హోమంలో భక్తులు పాల్గొని స్వామివార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉభయకర్తలుగా ఆర్.రక్షిత్‌శర్మ దంపతులు వ్యవహరించారు. కార్యక్రమాలను మఠం నిర్వాహకులు కొత్రపాటి నందకిశోర్, ఉషాకుమారి దంపతులు పర్యవేక్షించారు.

సెమీస్‌కు చేరిన నెల్లూరు జట్టు



సెమీఫైనల్‌కు చేరిన నెల్లూరు జట్టు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): అనంతపురంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి జర్నలిస్టు క్రికెట్ పోటీల్లో నెల్లూరు జిల్లా జట్టు సెమీఫైనల్‌కు చేరుకుంది. రెండో రోజు సోమవారం కర్నూలు, నెల్లూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న నెల్లూరు జట్టు 15 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 95 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్ చేసిన కర్నూలు జట్టు 15 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 68 పరుగులు చేయడంతో నెల్లూరు జట్టు 27 పరుగుల తేడాతో విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరుకుంది.

అస్తవ్యస్తంగా వార్డుల విభజన

- మండల అఖిలపక్ష నాయకుల ఆవేదన
- కమిషనర్‌కు వినతిపత్రం అందజేత



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అఖిలపక్షం నాయకులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: బుచ్చి మున్సిపాలిటీ పరిధిలోని వార్డులను అస్తవ్యస్తంగా విభజించారని మండల అఖిలపక్ష నాయకులు అన్నారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ బాలకృష్ణకు సోమవారం వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గతనెలలో మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 20 వార్డులను 27కు విభజిస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. అయితే ఈ వార్డుల విభజన ఎవరికీ అర్థంకాని విధంగా ఉందని వాపోయారు. బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాలిటీ పరిధిలో బుచ్చి రెవెన్యూతో పాటుగా ఇస్కపాళెం రెవెన్యూ కూడా కలిసి ఉందని, అయితే దీనిని ఎక్కడా కూడా సర్వే నంబర్‌తో చూపించలేదు. సర్వే నంబర్లకు ఈశాన్యం, దక్షిణం, ఉత్తరం అంటూ పేర్కొన్నారని, దీంతో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. బుచ్చిరెడ్డిపాళెం రూరల్ పురందరపురం గ్రామంలో ఉన్న 1,270 సర్వే నంబర్‌ను 8వ వార్డులో చూపారని, దీంతో ఏ వార్డు ఎక్కడో, ఏ ప్రాంతం ఏ వార్డు కిందకు వస్తుందో తెలియడంలేదు. ప్రభుత్వం క్లాక్‌వైస్ ఆర్డర్‌లో వార్డులను విభజించాలనే ఆదేశాలు ఉన్నా.. అధికారులు అడ్డదిడ్డంగా విభజించారన్నారు. ఈ కారణంగా ఒక వార్డులో వందల సంఖ్యలో ఓటర్లు ఉంటే మరో వార్డులో వేల సంఖ్యలో ఉన్నారన్నారు. వాస్తవానికి వార్డుల విభజన జరిగే సమయంలో స్థానికంగా ఉన్న రాజకీయ పార్టీ నేతలతో సమావేశం ఏర్పాటు చేసి వారి నిర్ణయాలను పరిగణనలోకి తీసుకొని ఉంటే బాగుండేదన్నారు. రాజకీయ పార్టీల సహకారం తీసుకోకపోవడం, ప్రజలకు విభజనపై అవగాహన కల్పించకపోవడంతో సమస్య ఏర్పడిందని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు షేక్ షాహుల్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు వింజమూరు వెంకటేశ్వర్లు, సీపీఎం నాయకుడు ముత్యాల గురునాథం, చల్లాకొలుసు మల్లికార్జున, పోతంశెట్టి శ్రీనివాసులు పాల్గొన్నారు.

వ్యాపారస్తులకు అండగా ఉంటాం



అగ్నిప్రమాదానికి గురైన మార్కెట్‌ను పరిశీలిస్తున్న నారాయణ

నెల్లూరు సిటీ: అగ్నిప్రమాదానికి గురైన దుకాణాలకు సంబంధించి వ్యాపారస్తులకు అండగా ఉంటానని మంత్రి నారాయణ హామీ ఇచ్చారు. ఈ మేరకు ఆయన సంతపేటలోని పాతదుస్తుల మార్కెట్‌ను సోమవారం పరిశీలించారు. బాధితులకు చెప్పిన విధంగా త్వరలోనే నష్టపరిహారం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు ధర్మవరపు సుబ్బారావు, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తోపుడు బండ్ల పంపిణీ

చిరు వ్యాపారులకు 70 తోపుడు బండ్లు, ఐదు ఇస్త్రీ బండ్లను రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఉచితంగా అందజేశారు. నగరంలోని గోమతినగర్‌లో ఉన్న ఆయన క్యాంపు కార్యాలయంలో వీటిని అందజేసి, మాట్లాడారు. ఇప్పటివరకు 476 మందికి తోపుడు బండ్లు అందజేసినట్లు తెలిపారు.

40 పార్కుల ఆధునీకీకరణ

నగరంలో ఇప్పటివరకు 40 పార్కుల ఆధునికీకరణను పూర్తి చేసినట్లు మంత్రి నారాయణ అన్నారు. ఏసీనగర్‌లో రూ.25 లక్షలతో ఆధునికీకరించిన మాగుంట సుబ్బరామిరెడ్డి మున్సిపల్ పార్కును సోమవారం ఆయన ప్రారంభించారు. నగర పరిధిలోని 47 పార్కులకు గానూ 40 పార్కులను ఆధునికీకరించామని, మరో ఏడు పార్కులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు.

బైక్ చోరీపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): బైక్ చోరీపై చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. సరస్వతీనగర్‌కు చెందిన వెంకటేశ్వర్లు ఈనెల 4వ తేదీ ఉదయం మూలాపేట అలంకార్ సెంటర్ సమీపంలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్‌కు వెళ్లారు. ఈ క్రమంలో బ్యాంక్ బయట తన బైక్‌ను నిలిపి పని ముగించుకుని బయటకు వచ్చిచూడగా బైక్ కనిపించలేదు. ఈమేరకు బాధితుడు చిన్నబజారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సోమవారం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్యారమ్స్ టోర్నీ ప్రారంభం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లా స్థాయి క్యారమ్స్ టోర్నమెంట్ నగరంలోని మల్లపు అర్లప్ప కమ్యూనిటీ హాల్లో సోమవారం ప్రారంభమైంది. మాజీ రంజీ క్రీడాకారుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు మలిరెడ్డి కోటారెడ్డి, జిల్లా క్యారమ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీమన్నారాయణ ముఖ్య అతిథులుగా హాజరై పోటీలను ప్రారంభించారు. రెండు రోజుల పాటు జరిగే మెన్స్ సింగిల్ పోటీల్లో గెలుపొందిన వారికి నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేస్తామని జిల్లా క్యారమ్స్ అసోసియేషన్ సెక్రటరీ పి.శ్రీనివాసులు తెలిపారు. 40 మంది క్రీడాకారులు ఆరుగురు అంపైర్లతో పోటీలను జరుపుతున్నట్లు నిర్వాహకులు దామవరపు నవీన్, తమిదల ప్రసన్నకుమార్ తెలియజేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని ఎంజీ నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో ట్రాన్స్‌ఫార్మర్స్ మరమ్మతులు, రోడ్డు వెడల్పు చేసిన ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు మార్చే కార్యక్రమాలు చేపడుతున్న కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని ఆ శాఖ నెల్లూరు టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని జేవీఆర్ కాలనీ, లక్ష్మీనరసింహపురం, పొదలకూరు రోడ్డు సర్కిల్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేపట్నుంచి మండల స్థాయి ఎంపికలు

నెల్లూరు (టౌన్): స్టేట్ గేమ్స్ ఫెడరేషన్–2025 రూరల్ మండల స్థాయి ఎంపికలు ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు జరుగనున్నట్లు ఎస్జీఎఫ్ మండల ఇన్‌చార్జి అరిగెల విజయకుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక దర్గామిట్టలోని డీసీఆర్ జిల్లా పరిషత్ హైస్కూల్, ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఎంపికలు జరుగుతాయన్నారు. 8న జెడ్పీ హెచ్‌ఎస్‌లో కబడ్డీ, చెస్, యోగా, 9న ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, 10న జెడ్పీహెచ్‌ఎస్‌లో ఖోఖో, వాలీబాల్ ఎంపికలు ఉంటాయన్నారు.

ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తే చర్యలు

నెల్లూరు(బారకాసు): నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో అనుమతుల్లేకుండా డివైడర్లలో, ఇతర ప్రదేశాల్లో ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని ఎన్‌ఎంసీ సిటీ ప్లానర్ హిమబిందు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఫ్లెక్సీలను నిషేధించడమైందన్నారు. ఎవరైనా ఎన్‌ఎంసీ అనుమతి లేకుండా ఫ్లెక్సీలు, వాల్ పోస్టర్లను ఏర్పాటు చేస్తే సంబంధిత వ్యక్తులతో పాటు ప్రింటింగ్ చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దంపతులపై దాడి

నెల్లూరు(క్రైమ్): దంపతులపై దాడి చేసిన వారిపై నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. శెట్టిగుంటరోడ్డు దళితవాడలో ఆటోడ్రైవర్ పి.వెంకటరమణయ్య, అమ్ములమ్మ దంపతులు నివాసం ఉంటున్నారు. ఈనెల 5వ తేదీ రాత్రి వెంకటరమణయ్య పనులు ముగించుకుని ఆటోలో ఇంటికి బయలుదేరాడు. ఇంటి సమీపంలోకి వచ్చేసరికి అదే ప్రాంతానికి చెందిన తరుణ్, అతని బంధువులు హరి, వేణు రోడ్డుపై కూర్చొని మాట్లాడుకోసాగారు. ఆటోడ్రైవర్ హారన్ కొట్టి పక్కకు జరగాలని చెప్పడంతో కోపోద్రిక్తులైన వారు వెంకటరమణయ్యపై దాడి చేశారు. దీనిని గమనించిన అమ్ములమ్మ నిందితులను అడ్డుకునే ప్రయత్నం చేయగా వారు ఆమెపైనా దాడిచేసి పరారయ్యారు. ఈ మేరకు బాధితులు సోమవారం నవాబుపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

‘మా గ్రామాన్ని విడగొట్టొద్దు’

- అధికారులకు మంచి మనస్సు ప్రసాదించాలని వినతి



అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న కదిరినేనిపల్లి గ్రామస్తులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): మా గ్రామాన్ని విడగొట్టకుండా ఒకే పంచాయతీగా కొనసాగించాలని వేడుకుంటూ నగరంలోని వీఆర్సీ కూడలి వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి మర్రిపాడు మండలం కదిరినేనిపల్లి గ్రామస్తులు సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. జిల్లా అధికారులు, రాజకీయ నాయకులకు మంచి మనస్సు ప్రసాదించాలని వేడుకున్నారు. ఈ మేరకు స్థానికులు ఒంగోలు బాలకృష్ణ, నూతలపాటి వెంకటేశ్వర్లు, గోపాల్, నాయబ్ రసూల్ మాట్లాడుతూ మండలంలోని మేజర్ పంచాయతీగా ఉన్న చిన్న మాచనూరు గ్రామ పంచాయతీని కొంతమంది విడగొట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారన్నారు. చిన్నమాచనూరు గ్రామ పంచాయతీలోనే కదిరినేనిపల్లిని కొనసాగించాలని అంబేడ్కర్ విగ్రహానికి విజ్ఞప్తి చేశారు. కదిరినేనిపల్లి గ్రామాన్ని వేరే పంచాయతీగా విడదీస్తే గ్రామంలోని దళిత, గిరిజన, వెనుకబడిన వర్గాల ప్రజలకు రక్షణ లేకుండాపోతుందని వారు వాపోయారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఎలాంటి కష్టం వచ్చినా గ్రామ పంచాయతీలోని ప్రతిఒక్కరూ స్పందించి ఆదుకుంటున్నారని, అలాంటి ఆప్యాయతల నుంచి తమను వేరు చేయవద్దని వేడుకున్నారు. కొందరి స్వార్థం కోసం సుభిక్షంగా ఉన్న గ్రామ పంచాయతీని ముక్కలు చేయవద్దని విజ్ఞప్తి చేశారు.

పాపకన్నుకు నేదురుమల్లి అభినందన



నేదురుమల్లికి పుష్పగుచ్ఛం ఇస్తున్న పాపకన్ను మధుసూదన్‌రెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్‌సీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడిగా రాపూరుకు చెందిన పాపకన్ను మధుసూదన్‌రెడ్డిని నియమించడంతో వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అభినందించారు. నగరంలోని డైకస్‌రోడ్డులో ఉన్న నేదురుమల్లి నివాసంలో పాపకన్ను మధుసూదన్‌రెడ్డి సోమవారం రామ్‌కుమార్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. పార్టీ పటిష్టతకు కృషిచేసే ప్రతి ఒక్కరికి వైఎస్సార్‌సీపీలో సముచిత స్థానం లభిస్తుందన్నారు.

వైద్య పరీక్షలు చేయించుకోవాలి



రికార్డులు తనిఖీ చేస్తున్న ఖాదర్‌వలీ

నెల్లూరు (టౌన్): గత రెండు వారాల నుంచి దగ్గు, జ్వరం, ఆకలి లేకపోవడం, రాత్రి పూట చమటలు పట్టడం, ఆకస్మికంగా బరువు తగ్గడం లాంటి లక్షణాలతో బాధ పడుతున్న వారు సమీపంలోని ఆరోగ్య కేంద్రంలో గళ్ల పరీక్ష చేయించుకోవాలని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నివారణాధికారి ఖాదర్‌వలీ తెలిపారు. స్థానిక జనార్దన్‌రెడ్డి కాలనీ, జాఫర్‌సాహెబ్ కెనాల్, పీసీనాయుడు వీధుల్లోని ఆరోగ్య కేంద్రాలను ఆయన సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ గళ్ల పరీక్షలో పాజిటివ్‌గా నిర్ధారణ అయితే ఆరు నెలల పాటు ఆరోగ్య కేంద్రాల్లో మందులు ఉచితంగా అందజేస్తామన్నారు. కార్యక్రమంలో టీబీ నివారణ, అర్బన్ ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

వడ్డే ఓబన్నకు ఘన నివాళి



నెల్లూరు(వీఆర్సీసెంటర్): స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని మినీబైపాస్‌రోడ్డులో ఉన్న భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో ఏపీ వడ్డెర వృత్తిదారుల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుంజి దయాకర్ మాట్లాడుతూ, ఓబన్న పోరాటస్ఫూర్తి ఆదర్శనీయమన్నారు. 1846 అక్టోబర్ 6వ తేదీ బ్రిటిష్‌వారి తుపాకీ గుండ్లకు ఓబన్న బలయ్యారని, ఆయన త్యాగం నేటి తరానికి తెలియాల్సిన అవసరం ఉందన్నారు. నగరంలో వడ్డే ఓబన్న విగ్రహ ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాల వెంకటేశ్వర్లు, వెంకయ్య, కృష్ణయ్య, శ్రీకాంత్, తిరుపాలు, అంకయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రంజీ జట్టుకు నలుగురు నెల్లూరీయులు



హెడ్‌కోచ్‌తో నెల్లూరు క్రీడాకారులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఆంధ్రా రంజీ క్రికెట్ జట్టుకు నెల్లూరు నుంచి నలుగురు క్రీడాకారులు ఎంపికైనట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, కార్యదర్శి కె.శ్రీనివాసులు సోమవారం తెలిపారు. కె.అశ్విన్ హెబ్బార్, కె.రేవంత్‌రెడ్డి, జె.సాకేత్‌రామ్, టి.భరత్‌లు ఆంధ్రా రంజీ క్రికెట్ జట్టుకు ఎంపిక కావడం హర్షణీయమన్నారు. విజయనగరంలో జరుగుతున్న శిక్షణా శిబిరం నుంచి వీరు ఎంపికయ్యారని, గ్యారీ స్టడ్ హెడ్ కోచ్‌గా శిక్షణ ఇస్తున్నారని తెలిపారు. మేనేజర్ భానుప్రకాష్‌రెడ్డి, పలువురు సీనియర్ క్రీడాకారులు అభినందనలు తెలిపారు.